షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

సంపుటి : 1 సంచిక : 218 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 20 జూన్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 218 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE June 20, 2024 PAGES : 8 PRICE : 3/-


## రైతులకు కేంద్రం గుడ్‌న్యూస్..

వరి కనీస మద్దతు ధర రూ. 117 పెంపు

14 ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపు

14 రకాల పంటలకు మద్దతు ధర పెంపు

న్యూఢిల్లీ,జూన్19(షణ్ముఖవెలుగు): రైతులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. వరి, రాగి, మొక్కజొన్న, జొన్న, పత్తితో సహా 14 ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరి కనీస మద్దతు ధరను రూ. 117 పెంచినట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు. ఈ మద్దతు ధర

మిగతా 2లో..



## నలందా కొత్త క్యాంపస్ ప్రారంభం

### ఇది వారసత్వం, సంస్కృతికి చిహ్నం

### క్యాంపస్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

పట్నా,జూన్19(షణ్ముఖవెలుగు):

నలంద విశ్వవిద్యాలయం భారతదేశ వారసత్వానికి, సంస్కృతికి చిహ్నం అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. పురాతన శిథిలాల నుంచి ఇది పునరుజ్జీవించిందని కొనియాడారు. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో బుధవారం నలంద విశ్వవిద్యాలయం కొత్త క్యాంపస్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర వి.అర్లేకర్, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ ఈ కొత్త క్యాంపస్ భారతదేశ సామర్థ్యాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేస్తోందన్నారు. అగ్ని కీలల్లో పుస్తకాలు కాలిపోవచ్చు కాని జ్ఞానం కాదని వివరించారు. ఐదో శతాబ్దంలో స్థాపించిన పురాతన నలంద విశ్వవిద్యాలయానికి అప్పట్లో ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి విద్యార్థులు వచ్చి చదువుకొనేవారు. నిపుణులు తెలిపిన వివరాల ప్రకారం.. నలంద విశ్వవిద్యాలయం 800 సంవత్సరాల పాటు తన సేవలు అందించింది. 12వ శతాబ్దంలో దేశంలోకి వచ్చిన ఆఫ్ఘన్లు ఈ విశ్వవిద్యాలయాన్ని కూల్చివేశారు. అందులోని పుస్తకాలు, మాన్యుస్క్రిప్ట్‌లను తగులబెట్టారు. ఈ ప్రాంతాన్ని 2016లో ఐక్యరాజ్యసమితి వారసత్వ సంపదగా ప్రకటించింది.



## నీట్ ఆందోళనలకు కాంగ్రెస్ మద్దతు

### 21న యోగా డే రోజు ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు

న్యూఢిల్లీ,జూన్19(షణ్ముఖవెలుగు): నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థిసంఘాలు, విపక్షాలు ఆందోళనలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 21న యోగా డే రోజున నీట్‌లో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. జూన్ 21న దేశవ్యాప్తంగా అన్ని

మిగతా 2లో..

## ఎపిలో భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

### జిఎడికి శ్రీలక్ష్మీ, రజత్ భార్గవ, ప్రవీణ్ ప్రకాశ్‌ల అటాచ్

### జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శిగా సాయిప్రసాద్

### సీఆర్‌డీఏ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్ నియామకం



అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): ఆంధ్రప్రదేశ్‌లో భారీగా ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌లను జీఏడీకి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పూనం మాలకొండయ్య లాంటి వారిని కూడా జిఎడికి అటాచ్ చేశారు. గత జగన్ ప్రభుత్వంతో అంటకాగిన వారిని పక్కన పెట్టారు. ఈ క్రమంలో జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్ నియమితులయ్యారు. పోలవరం సహా పట్టిసీమ తదితర ప్రాజెక్టులకు ప్రాధాన్యం పెరిగిన క్రమంలో సాయిప్రసాద్‌కు బాధ్యతలు పెరగనున్నాయి. ఆయన సమర్థుడైన అధికారిగా పేరుంది. ఇకపోతే పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా శశిభూషణ్ కుమార్, వ్యవసాయశాఖ

మిగతా 2లో..

## ఏపీ కొత్త డీజీపీగా ద్వారకా తిరుమలరావు

### హెూం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా హరీశ్‌కుమార్ గుప్తా

అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): హరీశ్‌కుమార్ గుప్తాను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకాతిరుమలరావును నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. వాస్తవానికి చంద్రబాబు సీఎం కాగానే.. ద్వారకా తిరుమలరావునే డీజీపీగా

మిగతా 2లో..



## ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల

### సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం

అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): ఎన్నికలు ముగిశాయి. విజేతల సంబరాలూ ముగిశాయి. కూటమి పక్ష నేతగా చంద్రబాబు ఎన్నికవ్వటం. ఆయనే ముఖ్యమంత్రిగా ప్రమాణం

మిగతా 2లో..



## అమరావతికి మళ్లీ.. పునరుజ్జీవం

### రాజధాని ప్రాంతంలో నేడు చంద్రబాబు పర్యటన

### తదుపరి కార్యాచరణపై ప్రకటన

**ఐదేళ్లపాటు పడావుపడిన అమరావతికి మళ్లీ పునర్వైభవం రానుంది. అమరావతికి అద్భుతమైన రాజధాని సిద్ధం కానుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం నాడు రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటించనున్నారు. తొలి పర్యటనగా నవ్యాంధ్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం.. రెండో పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో పర్యటించ నున్నారు. ఉండవల్లిలో నాటి వైసీపీ ప్రభుత్వం కూల్చిన ప్రజావేదిక నుంచి రాజధాని పర్యటనను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో తన రెండో పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో పర్యటించి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించనున్నారు.**

అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): గురువారం తన నివాసం నుండి ఉదయం 11 గంటలకు పర్యటనకు బయలుదేరుతారు. ఉండవల్లిలో నాటి ప్రభుత్వం కూల్చిన ప్రజావేదిక నుంచి సీఎం పర్యటనను ప్రారంభించనున్నారు. అనంతరం ఉద్దండరాయునిపాలెంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శిస్తారు.

మిగతా 2లో..



## 24న ఎపి కేబినేట్ భేటీ

### పలు అంశాలపై చర్చించే అవకాశం

### 21న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం



అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): ఏపీలో కొత్త ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత తొలి కేబినెట్ భేటీకిముహూర్తం ఖరారైంది. ఈ నెల 24న సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు మంత్రివర్గం భేటీ కానుంది. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ప్రతిపాదనలు పంపాలని అన్ని ప్రభుత్వ శాఖలకు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21న సాయంత్రం 4 గంటల్లోపు ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేసింది. ఈ క్రమంలో సీఎం సంతకాలు చేసిన డీఎస్సీ పోస్టుల భర్తీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్నా క్యాంటీన్ల ఏర్పాటు వంటి నిర్ణయాలను

## ఢిల్లీకి తీవ్ర వడదెబ్బ..

### నోయిడాలో ఒక్కరోజే 10 మంది మృతి!

న్యూఢిల్లీ,జూన్19(షణ్ముఖవెలుగు): మండే ఎండలు, భీకరమైన వడగాలులు, తీవ్రమైన నీటి కొరత ఢిల్లీ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఎండలు, వడగాలులతో ఢిల్లీలో గడిచిన వారం రోజుల్లో 20 మంది చనిపోయారు. ఢిల్లీ పక్కనే ఉన్న నోయిడాలో ఒక్కరోజులోనే 10మంది మృత్యువాత

మిగతా 2లో..



## గ్రామీణ సమస్యలపై తక్షణ చర్యలు

### అధికారులకు దిశానిర్దేశంచేసిన డిప్యూటీ సిఎం

### మూడు నెలల తరువాత మళ్లీ సమీక్షిస్తానని వెల్లడి

### డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ బాధ్యతల స్వీకరణ

### ఇంద్రకీలాద్రి పండితుల వేదాశీర్వచనం



విజయవాడ,జూన్19(షణ్ముఖవెలుగు): గ్రామాలలో మౌలిక వసతులు, రోడ్ల నిర్మాణం, మంచినీటి ఎద్దడి నివారణ వంటి అంశాలపై ఐఏఎస్ అధికారులకు డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ పలు సూచనలు చేశారు.ప్రణాళికలు సిద్ధం చేసి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పవన్ కు ఇంద్రకీలాద్రి దేవస్థాన వేదపండితుల ఆశీర్వచనాలు అందించారు. బాధ్యతలు స్వీకరించగానే పలు ఫైళ్లపైన పవన్ సంతకాలు చేశారు. పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎంతో పాటుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన అధికారిక పత్రాలపై ఆయన సంతకం చేశారు. దీంతో డీప్యూటీ సీఎంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా కూడా ఆయన బాధ్యతలు స్వీకరించినట్టయింది.జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి విజయవాడ చేరుకున్న ఆయన క్యాంపు కార్యాలయంలోకి ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి అడుగు పెట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. పలు శాఖల అధికారులతో పాటు పలువురు మంత్రి, పవన్ సోదరుడు నాగబాబు అభినందనలు తెలిపారు. మూడు నెలల తర్వాత పనుల పురోగతిపై పునఃసమీక్ష చేస్తానన్నారు. ఈ మూడు నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని

మిగతా 2లో..

## అధికార వైసిపికి భయపడే ఓటేయలేదు

### ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

### కడపలో ఓటమిపై షర్మిల పోస్ట్‌మార్టమ్



విజయవాడ,జూన్19(షణ్ముఖవెలుగు): కడప లోక్‌సభ స్థానంలో ఓటమిపై ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. సీఎం, సిట్టింగ్ ఎంపీ కడప పార్లమెంట్ స్థానంలోని ప్రజలను భయపెట్టిన కారణంగానే తాను ఎంపీగా ఓడిపోయానన్నారు. వైసీపీకి వ్యతిరేకంగా ఓటు వేశామని తెలిస్తే తమను ఇబ్బందులు పెడతారని కడప ప్రజలు భయపడ్డారని షర్మిల తెలిపారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ పథకాల్లో కోత పెడతారని, తమకు పథకాలు రాకుండా చేస్తారనే ఉద్దేశంతోనే ఓటర్లు తనకు ఓటు వేయలేదన్నారు. పథకాలు పోతాయనే భయంతోనే

మిగతా 2లో..

## రుషికొండ భవనాలను వినియోగిస్తాం

### ప్రజావేదికను కూల్చినట్లుగా చేయం

### సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి

ఒంగోలు,జూన్19(షణ్ముఖవెలుగు): విశాఖ రుషికొండపై నిర్మించిన భవనాలను ఎన్డీయే ప్రభుత్వం కచ్చితంగా ఉపయోగించుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. భవనాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారని మంత్రి చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం మాదిరిగా తాము ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయమన్నారు.ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం అమరావతిలో ప్రజావేదికను కూల్చివేయడాన్ని గుర్తు చేశారు. అలాంటి పనులు ఎప్పటికీ తమ అధినేత చంద్రబాబు చేయరన్నారు. ప్రభుత్వ డబ్బు వృథా కానివ్వమని, నష్టం కలిగించేలా వ్యవహరించమని వెల్లడించారు. ప్రస్తుత వైసీపీ

మిగతా 2లో..

## గంజాయి, డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం

**మాదక ద్రవ్యాల వినయోగం అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్**

**అమ్మాయిలపై అఘాయిత్యాలను సహించేది లేదు**

**మహిళా పోలీస్ స్టేషన్లుగా ఇక దిశ పోలీస్ స్టేషన్లు**

**సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేసే పోస్టులపై చర్యలు**

**బాధ్యతలు స్వీకరించిన హోంమంత్రి వంగలపూడి అనిత**

**పుష్పగుచ్ఛాలు అందించి అబినందించిన డిజిపి, తదితరులు**

అమరావతి,జూన్19(షణ్ముఖవెలుగు): గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం పై ఉక్కుపాదం మోపుతాం అని రాష్ట్ర హోమ్ ,విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడి వినియోగంపై,అమ్మాయిలపై జరిగే అఘాయిత్యాలపై ఉక్కుపాదం మోపడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పటిష్టమైన చర్యలు చేపడతామని అనిత

మిగతా 2లో..



## 20.6లక్షల గృహాలు మంజూరైతే 6.8లక్షల నిర్మాణాలు

- 13.8 లక్షల ఇళ్ళను పూర్తి చేయలేకపోయిన గత ప్రభుత్వం
- 5లక్షల ఇళ్ళు పనులే ఇంకా మొదలు కాలేదు
- గృహ నిర్మాణం విషయంలో పేదలకు తీరని నష్టం
- యూనిట్ విలువ రూ.2.5లక్షలుంటే.. రూ.1.80ల.కు తగ్గించారు
- 933 కోట్ల రూ.ల పెండింగ్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం
- అనువుగాని స్థలాలను సేకరించి ప్రజాధనాన్ని దుర్వినియోగం
- దానిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం
- అవకతవకలపై విచారణ చేయిస్తాం

రాష్ట్ర గృహనిర్మాణ, సమచార శాఖ మంత్రి పార్థసారథి

2లో..

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం




# అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటాం
- తాగు, సాగునీటి సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపాలి
- నకిలీ బిల్లులు చేసిన అధికారులపై చర్యలు తప్పవు
- జిల్లా స్థాయి అధికారుల పరిచయ కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీ, సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ
- బాలవీరాంజనేయస్వామి వెలిగొండ ప్రాజెక్టును త్వరగా అందుబాటులోకి తేవాలి
- ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి
- ఒంగోలులో ఏ ప్రాంతంలో కూడా తాగునీటి సమస్య ఉండకూడదు
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు
- నియోజకవర్గంలో తాగునీటి నాణ్యత పెంచాలి
- ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా లేకుండా దొంగ బిల్లులు అధికం
- జల జీవన్ మిషన్ పనుల్లో అక్రమాలు వెలికితీయాలి
- వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస పరిహార
- లబ్ధిదారుల గుర్తింపులో భారీ అక్రమాలు
- సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలి
- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా పెంచాలి
- గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- సాగర్‌నీరు రాకపోయినా ఇతర పనులకు లక్షల్లో బిల్లులు చెల్లింపులు జరిగాయి
- కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి
- ఎం బుక్ రికార్డుల్లో లోపాలున్నాయి
- వైపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు
- పారిశుధ్య లోపం తీవ్రం
- దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 19)**

అభివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రాన్ని జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ. దివ్యాంగులు పయోవృద్ధుల సంక్షేమ. సచివాలయాలు, వాలంటీర్ల శాఖా మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి అధికారుల పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన మంత్రికి కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. మంత్రితోపాటు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బి ఎన్ విజయ్ కుమార్, కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డితో పాటు యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిలు గూడూరి ఎరిక్షన్ బాబు, గొట్టిపాటి లక్ష్మిలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధికారుల పరిచయ కార్యక్రమం అనంతరం తాగు, సాగు నీరు, వైద్యం, పారిశుధ్యం వ్యవసాయం, విద్యా శాఖలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తాగు, సాగు నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యలతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అన్నారు. అధికారులు కూడా ఆ దిశగా ఆవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని, ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉంటుందని, ఉద్యోగులు, అధికారులు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ట్యాంకర్ల ద్వారా నిబంధనల మేరకు నీటి సరఫరా చేయకపోయినప్పటికీ నకిలీ బిల్లులకు చెల్లింపులు చేసినట్టు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పైపులైన్లు చేసేటప్పుడు తవ్వేసిన సిమెంట్ రోడ్లను నిబంధనల ప్రకారం తిరిగి రిపేరు చేయించాలని అధికారులను ఆదేశించారు. వెలిగొండ కుడి కాలువకు పాలేరు, ముసీ నదుల అనుసంధానానికి ప్రతిపాదనలు రూపొందించాలని స్పష్టం చేశారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో సచివాలయాలు, వైద్యఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. మురుగు కాల్వలను రెగ్యులర్‌గా క్లీన్ చేయించాలని ఆదేశించారు. 2019కి ముందు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పలు జూనియర్ కాలేజీలలో కొత్తగా అందుబాటులోకి తెచ్చి అనంతరం 2020 తరువాత తొలగించిన కోర్సుల వివరాలను తనకు సమర్పించాలని జిల్లా సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ ను మంత్రి ఆదేశించారు. గురువారం జిల్లాలో కేంద్ర కరువు అధ్యయన బృందం పర్యటించనున్న నేపథ్యంలో బాధిత రైతులకు న్యాయం జరిగేలా పూర్తి వివరాలను బృందం దృష్టికి తీసుకువెళ్లాలని వ్యవసాయ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. నకిలీ సర్టిఫికెట్లతో దివ్యాంగుల కోటాలో పెన్షన్లు పొందుతున్నట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఎంపి మాగుంట మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టును త్వరగా అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున శ్రీశైలం నియోజకవర్గంలోని హెడ్ రెగ్యులేటర్ ఉన్న రెండు మండలాలను కూడా ప్రకాశం జిల్లా పరిధిలోకి తీసుకువస్తే భవిష్యత్తులో ప్రాజెక్ట్ నిర్వహణ సులభతరమవుతుందని అన్నారు. ప్రాజెక్ట్ నిర్వాసితులకు అధిపరమైన పరిహారం విధులను క్రమంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేలా చూడాలని మంత్రిని కోరాను. నిర్వాసితుల సమస్యను ఒకవైపు పరిష్కరిస్తూ, ప్రాజెక్ట్ నిర్మాణంలోని పెండింగ్ (తరువాయి 4లో...)



# కరువు అంచనాలు సిద్ధం చేయాలి

## కలెక్టర్ దినేష్ కుమార్



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 19)**

కరువును అంచనా వేసేందుకు జిల్లాకు వస్తున్న కేంద్ర బృందానికి సమగ్రంగా నష్టం వివరాలను అందించేందుకు నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని తను చాంబర్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, అధికారులతో సమావేశమై ఈనెల 20వ తేదీన కేంద్ర బృందం జిల్లా పర్యటన విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్టోబర్ నుంచి మార్చి (తరువాయి 4లో...)

# విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు

## రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 19)**

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో ఏమాత్రం అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ (తరువాయి 4లో...)

# గెలిస్తే తనగొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా?

## జగన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలి

## విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జూన్ 19)**

బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలన్న వైఎస్ జగన్‌రెడ్డి పై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల షాక్ నుంచి వైఎస్ జగన్ ఇంకా కోలుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎలాన్ మస్క్‌లా జగన్ మాట్లాడుతున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. గెలిస్తే తన గొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా? అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలిచినప్పుడు ఈవీఎంల గురించి తానేం మాట్లాడాడో ఓసారి మననం చేసుకోవాలన్నారు. పరనింద, ఆత్మస్తుతి మాని ఇకనైనా ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు. వరుసగా 5 సార్లు విజయం సాధించి మంత్రి పదవి చేపట్టాక మొదటిసారిగా బుధవారం సంతమాగులూరు మండల కేంద్రానికి విచ్చేసిన గొట్టిపాటి రవికుమార్‌కు (తరువాయి 4లో...)

# కోటంరెడ్డి ప్రచారానికి ఆదాల రెండు కోట్ల ఖర్చు

## గత 16 నెలలుగా అయిన ఖర్చు ఇది

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, నెల్లూరు, జూన్ 19)**



ఇదేమిటి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రచారానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత ఆదాల ప్రభాకర్ రెడ్డి రెండు కోట్లు ఖర్చు చేయటం ఏమిటి అని విస్తు పోతున్నారా. గత 16 నెలలుగా కోటంరెడ్డి గురించి రోజు పది వీడియోలు, ఫేస్బుక్, ఇంస్టాగ్రామ్, వాట్సా ప్‌లో ప్రచారం చేసేందుకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోషల్ మీడియా అనే సైన్యాన్ని బాగానే పెంచి పోషించారు. గత 16 నెలలుగా వీళ్ళకి అయిన ఖర్చు సుమారు రెండు కోట్ల రూపాయలు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి రౌడీ, గూండా, విశ్వసనీయత లేని వ్యక్తి అంటూ ప్రతిరోజు పుకాను పుంకాలుగా వీడియోలు తయారుచేసి ప్రజల మీదకి వదిలారు. సుమారు దీనికి రెండు కోట్లకు పైగానే ఖర్చయింది. మొత్తానికి రాజకీయ వ్యూహాలలో ఎత్తులు పై ఎత్తులు వేసే కోటంరెడ్డి వేసిన వలలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి పడి గిజగిజ కొట్టుకున్నారు. మొత్తానికి 16 నెలలకు సంబంధించి ఆదాల ప్రభాకర్‌రెడ్డికి చేతి చమురు బాగానే వదిలింది. ఆయన పుణ్యాన్ని కొంతమంది బాగానే మిగిల్చుకున్నారు. సాధారణంగా అయితే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 20 వేల ఓట్లతో గెలవాల్సింది. ఆదాల సోషల్ మీడియా ప్రతిరోజు కోటంరెడ్డి జపం చేయడం వల్ల దాదాపు 35 వేల ఓట్లతో విజయభేరి మోగించారు. ఆదాల గురించి ఎప్పుడో వారు మర్చిపోయారు. కోటంరెడ్డిని గురించి ప్రచారం చేయడమే వారి పనిగా మారింది. ఆదాల సోషల్ మీడియా ప్రచారంతో కోటంరెడ్డికి 35వేల మెజారిటీతో అఖండ విజయం లభించింది. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన మహా నాయకులు చెబుతుంటారు రాజకీయం చేసేవాళ్లు అది మంచైనా, చెడైనా నిరంతరం వార్తల్లో ఉండాలని ఆ పనిని ఆదాల శిబిరంలో కొంతమంది చక్కగా నెరవేర్చారు. కోటంరెడ్డిని గెలిపించేలా వారి వ్యూహరచన అద్భుతం అమోఘం. ఎవరు తీసిన గోతిలో వారే పడతారు మహానుభావా అన్న సామెత ఆదాల ప్రభాకర్ రెడ్డికి చక్కగా సరిపోతుంది.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



















సములను సమాంతరంగా పూర్తి వేయవచ్చని చెప్పారు. ఆంధ్ర కేసరి యూనివర్సిటీకి ఆవసరమైన విధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసేలా చూడాలని మంత్రిని కోరారు. సూరారెడ్డిపాలెం వద్ద ఆర్అండ్‌బి, ఆర్ఓబి నిర్మాణానికి అవసరమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణకు విధులు కూడా త్వరగా రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ఒంగోలులో ఏ ప్రాంతంలోనూ తాగు నీటి సమస్య ఉండ కూడదని అన్నారు. క్షేత్రస్థాయిలో రెగ్యులర్ గా పర్యటిస్తూ పరిస్థితిని పరిశీలిస్తూ ఉండాలని అధికారులకు చెప్పారు. మోటర్లు మరమ్మతులకు గురైన చోట తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలకు తీసుకోవాలన్నారు. టంగుటూరు,

కరవది, ఒంగోలులోని అగ్రహారం రైల్వే గేట్ల వద్ద సమస్యల పరిష్కారానికి అవసరమైన ఆర్ఓవిఆర్‌యువి నిర్మాణాలకు కూడా భూసేకరణకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యేలా చూస్తామన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో తాగు నీటి నాణ్యత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ఫిల్టర్ బెడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం సంతమాలపాడులో కొనసాగుతున్న ట్రిపుల్ ఐటిని ఇక్కడే ఉంచి త్వరలో ఏర్పడే మార్కాపురం జిల్లాలోని కనిగిరిలో కొత్త విద్యా సంస్థ వచ్చేలాగా చూడాలని మంత్రిని కోరారు.

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంతంలో ట్యాంకర్ల ద్వారా సాగు నీరు సరఫరా చేయకపోయినప్పటికీ దొంగ బిల్లులు పెట్టి సొమ్ము చేసుకున్న ఉదంతాలపై దర్యాప్తు చేయించాలని మంత్రిని కోరారు. అదే విధంగా జల జీవన్ మిషన్ పనులలోనూ అవినీతి జరిగిందని, వీటి పైనా దర్యాప్తు చేయించాలని అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పునరావాస పరిహారం కోసం లబ్ధిదారులను గుర్తించడంలోనూ భారీగా అవకతవకలు జరిగాయని, దీనిపైనా ప్రత్యేక దర్యాప్తు చేయించాలని కోరారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధవీడు, గిద్దలూరు మండలాలలో నీటి కొరత అధికంగా ఉందన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పెంచాలని అధికారులకు సూచించారు.

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిగి ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందన్నారు. సాగర్ నీరు కూడా తగినంత రావడంలేదని అన్నారు. కానీ కాంట్రాక్టర్లకు ఇతర పనుల నిర్వహణ కోసం లక్షల్లో చెల్లించడం జరిగిందన్నారు. యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఎం బుక్ రికార్డింగ్‌లో లోపాలు ఉన్నాయని, ట్రిప్పుల సంఖ్యకు మించి బ్యాంకర్లకు బిల్లుల చెల్లింపు జరిగిందన్నారు. దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో ఫిల్టర్ బెడ్ సమస్య ఉందని, వీటిని శుభ్రపరిచేలా చూడాలని మంత్రిని కోరారు. దర్శి నియోజకవర్గంలో పారిశుధ్య లోపం వలన వ్యాధుల ప్రబలుతున్నాయన్నారు. డ్రైనేజీ రేగ్యులర్‌గా చేయించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడడం కోసం ఆన్లైన్ ట్రాకింగ్ యాప్ వినియోగిస్తున్నామన్నారు. పశువులకు కూడా నీటి సరఫరా చేసేందుకు తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు.

కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలలో తాగునీటి ఎద్దడిని ప్రతి 15 రోజులకు ఒకసారి ఆధ్యయనం చేస్తామన్నారు. తాగునీటి సమస్యలను తమదృష్టికి తీసుకురావడానికి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. పారిశుధ్యం పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాలు, ముఖ్యంగా గంజాయిని నిర్మూలించేందుకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించామన్నారు. దీని అమలు బాధితులకు పునరావాసం కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వంద రోజుల్లో స్పష్టమైన మార్పు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద నమోదైన 145 కేసులలో ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందన్నారు. ఈ దర్యాప్తు వేగంగా పూర్తి కావడానికి ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్పెషల్ డి.ఎస్.సి. పోస్టును ప్రభుత్వం భర్తీ చేసేలా చూడాలని మంత్రిని కోరారు. అదే విధంగా సచివాలయ స్థాయిలో నియమితులైన మహిళా పోలీసు విధులు, వీరి విధానాలపై ప్రభుత్వం నుంచి మరింత స్పష్టత రావాల్సిన అవసరం ఉందని ఎస్పీ అన్నారు. ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ మర్దన్ అలీ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి పరిస్థితిని వివరించారు. సాగర్ నీటి ద్వారా సి.పి.డబ్ల్యు పథకాల క్రింద వచ్చే నెలాఖరు వరకు తాగు నీటికి ఇబ్బంది లేదన్నారు. రామతీర్థంలో మరో రెండున్నర నెలలకు సరిపడా తాగునీరు నిల్వ ఉందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ప్రస్తుతం 15 టిఎంసిల నీరు ఉందని, పై నుంచే విచ్చే నీటి లభ్యతను బట్టి దిగువకు నీరు విడుదల వేస్తామని చెప్పారు. నోటిఫైడ్ వెరువులను ముందుగా నింపుతున్నామని, స్థానిక అవసరాలు, ఆవశ్యకతను బట్టి కాప్-నోటిఫైడ్ చెరువులను కూడా నింపుతున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ ఎస్ఈ అబుత్ అలీమ్ మాట్లాడుతూ ఇటీవల దెబ్బతిన్న గుండ్లకమ్మ గేట్ల స్థానంలో జూలై 15 నాటికి కొత్త వాటిని పెడతామని, అగష్టు చివరివాటికి గేట్లన్నింటినీ పూర్తి స్థాయిలో మార్చి వీటిని నిల్వ చేసేలా చూస్తామని చెప్పారు. గేట్ల ఏర్పాటు, వాటి నిర్వహణ, కాల్వలలో సింగిల్ క్లియరెన్స్ నిర్వహణ కోసం రూ.15 కోట్లు అవసరం ఉందన్నారు. ఓట్ ఆఫ్ అకౌంట్ బడ్జెట్లో రూ.1.7 కోట్లు మాత్రమే కేటాయించారని, పూర్తి స్థాయి బడ్జెట్లో ఈ ప్రాజెక్ట్ కోసం నిధులు కేటాయించేలా చూడాలని మంత్రిని కోరారు. వెలుగొండ ప్రాజెక్ట్ ఎర్త్ వర్క్స్ పూర్తయ్యాయని, టన్నెల్ రైవింగ్, కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. కొండపి నియోజకవర్గంలోని పాలేరు ప్రాజెక్ట్ కోసం రూ.4 కోట్లు అవసరం ఉందని ఎస్ఈ చెప్పారు. దీని పై మంత్రి స్పందిస్తూ వెలుగొండ ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అధికారులు సమగ్ర నివేదిక ఇస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఆర్ శ్రీలత, ఏఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా అధికారులతో పాటు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు

విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా కురిసిన వర్షాలు, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో కూలిన కరెంటు స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణకు అధికారులు తీసుకుంటున్న చర్యలను బుధవారం రాష్ట్ర సచివాలయం నుండి టెలీకాన్ఫరెన్సు ద్వారా ఆయన సమీక్షించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలిపోయిన విద్యుత్ స్తంభాలను, తెగిన వైర్లను, దెబ్బతిన్న ఫీడర్లను యుద్ధ ప్రాతిపదిక పునరుద్ధరించి ప్రజలకు ఎటు వంటి అసౌకర్యంకలుగ కుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా రాబోయే 48 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో ఎటు వంటి అంతరాయం, అసౌకర్యం లేకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు.
రాష్ట్రంలోని పలు విద్యుత్ సంస్థల సిఎండీలు ఈ టెలీకాన్ఫరెన్సులో పాల్గొన్నారు.



# గెలిస్తే తనగొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా?


మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అద్దరోడ్డులోని స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పుట్టవారిపాలెంలోని మంత్రి అతిథి గృహంలో తెలుగుదేశంపార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువత కోసం నాడు చెప్పిన ప్రకారం మొదటి సంతకం మెగా డీఎస్సీ పై చేశారని, పెన్షన్ల పెంపు అమలు, రాష్ట్రానికి జీవనాడి అయినటువంటి పోలవరం, రాజధాని నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఒక ప్రణాళికతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తారని, అద్దంకి నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని, అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

# కరువు అంచనాలు సిద్ధం చేయాలి



వరకు మెట్ట ప్రాంతంలో వర్షా భావ పరిస్థితుల వలన పంట నష్టం, రిజర్వాయర్లు, చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం సంబంధిత అంశాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. పంట నష్టాలపై ఫోటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించాలని సూచించారు. పంట నష్టపోయిన ప్రాంతాల్లో రైతులతో ముఖాముఖి మాట్లాడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 38 మండలాల్లో 31 మండలాలను కరువు మండలాలుగా గుర్తించడం జరిగిందని, అందులో ఎర్రగొండపాలెం, దోర్నాల, కురిచేడు, ముండ్లమూరు, దర్శి, పొదిలి, మర్రిపాడు, పెద్దారవీడు, మార్కాపురం, కంభం, తర్లుపాడు, హెచ్ఎం పాడు, వెలిగండ్ల, పెదచేర్లోపల్లె, సి.ఎస్.పురం, పామూరు, ఎస్.ఎం.పాడు, ఒంగోలు, కొత్తపట్నం, పుల్లలచెరువు 20 మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా, దొనకొండ, కొనకనమిట్ల, అర్ధవీడు, బెస్తవారిపేట, రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, కనిగిరి, ఎన్.జి. పాడు, చీమకుర్తి, కొండపి 11 మండలాలను కరువు మండలాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాస్, సీపీఓ వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో మాధురి, పశు సంవర్ధక శాఖ జేడి బేబి రాణి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలి, డ్వామా పిడి అర్జున్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి గోపిచంద్, ఎల్డిఎం రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఓ మోసగాడు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 19)

## పెద్ద మనిషి ముసుగువేసుకున్న ఓ నయవంచకుడు
## కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని హననం చేయించేందుకు నా చేత కుట్ర చేయించారు
## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని బహిరంగ క్షమాపణ అడుగుతున్నా
## 40 ఏళ్ల స్నేహితుడు నా కోటంరెడ్డి
## పొరపాటు చేశాను క్షమించండి
## కష్టాల్లో కార్యకర్తలను వదిలి పరారైన మోసగాడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి
## జిల్లా వైసీపీ సీనియర్ నేత వైవి రామిరెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంచి నాయకుడు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ముఖ్యంగా పేద, నిరుపేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల సమస్యలు తీర్చే నిజమైన నాయకుడు. విద్యార్థి నాయకుడిగా జీవితాన్ని ప్రారంభించి, స్వయంకృషి నిరంతర కష్టంతో ఒకటికి మూడుసార్లు నెల్లూరు రూరల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నుకోబడిన ప్రజల మన్నలను పొందిన నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని జిల్లా వైసీపీ సీనియర్ నేత వైవి రామిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నాకు గత 40 ఏళ్ళుగా మంచి స్నేహితుడు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పై 16 నెలలుగా ఆదాల ప్రభాకర్ రెడ్డి నాచేత విపరీతంగా దుష్ప్రచారం చేయించడమే కాకుండా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబాన్ని చిద్రంచేసే రీతిలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యక్తిత్వ హననానికి పాల్పడే కుట్రకి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూత్రధారి అన్నారు. రాజకీయాలలో అబద్దాలతో కూడుకున్న వ్యక్తిగత విమర్శలు మంచిది కాదని ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నేను అనేక సార్లు హితవు చెప్పానన్నారు. కానీ వినలేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకున్న ఆదాల మమ్మల్ని భయభ్రాంతులను చేసి, బెదిరించి, మాచేత కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వ్యతిరేకంగా పచ్చి అబద్దాలతో కూడుకున్న వ్యక్తిగత విమర్శలు చేయించాడన్నారు. సోషల్ మీడియాకు 2 కోట్లు ఖర్చుపెట్టి ఆదాల కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై అబద్దాలతో కూడుకున్న వ్యక్తిగత విమర్శలు చేయించాడు. ఆ విమర్శలు చూసి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబం ఎంత మానసికక్షోభ అనుభవించిందో మాకు తెలుసు అన్నారు. ఇప్పుడు నాకు జ్ఞానోదయం కలిగింది. అందుకే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెబుతున్నాను. ఇది నేను చేసిన దారుణ తప్పు అని, సరిచేసుకునేదానికి దేవుడు ఇచ్చిన ఆలోచనగా భావిస్తున్నాను. 40ఏళ్ళ స్నేహితుడిగా ఉండడమే కాకుండా ఓ ఎమ్మెల్యేగా ఎంతో గౌరవంగా నిత్యం మా ఇంటికి వచ్చి నన్ను గౌరవించిన స్నేహశీలి నిజమైన స్నేహానికి మారుపేరు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విషయంలో నేను చేసింది దారుణమైన తప్పు. తనకోసం కష్టం చేసిన కార్యకర్తలను గాలికి వదిలేసి పరారైపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాజకీయాలకే అర్హుడు కాదన్నారు. ఆదాలను నమ్మిన అనేక మంది కార్యకర్తలను నట్టేట ముంచిన ఆదాలకి ఆ కార్యకర్తల ఉసురు తగలక తప్పదన్నారు.

# టొయోట అర్బన్ క్రూజర్ టైసర్ కారు విడుదల




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

నగర పరిధిలోని త్రోవగుంట వద్ద ఉన్న టొయోట షోరూం నందు మార్కెట్‌లోకి వచ్చిన నూతన టొయోట అర్బన్ క్రూజర్ టైసర్ కార్ ను కెనరా బ్యాంకు మేనేజర్ తరుణ్,సర్వీస్ మేనేజర్ పవన్ సోషల్ మీడియా ఫాలోవర్స్, ఒంగోలు పిల్ల సౌజన్య చేతుల మీదగా ప్రారంభించారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులకు షోరూం సిబ్బంది బొకే ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం నూతన కారును మార్కెట్ లోకి లాంచ్ చేశారు. జనరల్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ టొయోట అర్బన్ క్రూజర్ టైసర్ 5 వెరియట్స్‌లో లభిస్తుందన్నారు.కస్టమర్స్‌కి విశాలమైన సీటింగ్ సదుపాయంతో పాటు 360 డిగ్రీ కెమెరా, 6 ఎయిర్ బ్యాగ్స్ అందు బాటులోకి తీసుకొని రావడం జరిగిందన్నారు. లీటర్ పెట్రోల్ మాన్యువల్‌లో 22 కేఎం, ఆటో, మ్యానువల్ గేర్‌లో 21 కేఎం వస్తుం దన్నారు. ప్రత్యేకంగా ఇంట్లో నుంచి బయట వెళ్ళాలి అనుకునే ముందు కారు ఇంజన్ స్టార్ట్ చేసి ఏసీ ఆన్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. మార్కెట్ ధర 7.73 లక్షల నుంచి 13 లక్షల వరకు కారు ధర ఉందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకింగ్ సిబ్బంది, ఫైనాన్స్ సిబ్బంది, టొయోటా షోరూం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం భోజన కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 19)

ఏపీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం కార్మికులపై బెదిరింపులు, అక్రమ తొలగింపులు చర్యలను అరికట్టాలని కోరుతూ స్థానిక మండల ఎంఈఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికేఎం రఫీ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో కార్మికులుగా గత 25ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికి ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోయినా అప్పులు చేసి సైతం పథకాన్ని కొనసాగించారన్నారు. తమ కుటుంబంలో పిల్లలకు ఉన్న లేకపోయినా అప్పులు తెచ్చి స్కూల్లో వంట చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం మారడంతో కొందరు వ్యక్తులు మీరు మానుకోవాలని, రాజీనామా చేయాలని బెదిరింపులకు పూనుకొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో, బిల్లులతో పథకాన్ని సమర్థంగా నిర్వహిస్తూ బిల్లులు, మెస్ ఛార్జీలు పెంచాలని గతంలో అనేక పోరాటాలను నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు టి గురునాథం, కొండమ్మ, మరియమ్మ, నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ బాలనాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# 23న జరిగే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి

## బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేత మనోజ్ పిలుపు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 19)

ఈ నెల 23వ తేదీన కనిగిరిలో జరిగే హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు సంగరాజు సాయి మనోజ్, బిజెపి జిల్లా నాయకులు అడిదం అనిల్, పిలుపునిచ్చారు. బుధవారం హనుమాన్ శోభాయాత్ర సంబంధించి పట్టణంలోని పలువురు ప్రముఖులను వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో ఈ నెల 23వ తేదీన ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి కొత్తూరు శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం వరకు హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందని వారు తెలిపారు. ఈ శోభాయాత్రను కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి యాత్రను ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ యాత్రలో పట్టణ ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు హిందూ సంస్థలు ప్రతినిధులు పాల్గొంటారని వారు తెలిపారు. హనుమాన్ శోభాయాత్రలో హనుమంతుడి పది అడుగుల విగ్రహంతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందువులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

# పశ్చిమ ప్రాంతంలో ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 19)

జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సాయం అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కరవు బృంద సభ్యులను జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ కోరారు. జిల్లాలో కరవు పరిస్థితులను అంచనా వేయడానికి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు మన్ను జి.ఉపాధ్యాయ్, ఎస్‌సి కష్యప్, మదన్ మోహన్ మౌర్య, బి.అనురాధ బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరవు పరిస్థితులను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. జిల్లాలోని వలేటివారి పాలెం, కందుకూరు, లింగసముద్రం, సీతారామపురం, వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు, మర్రిపాడు, కలువాయి మండలాలను జాతీయ విపత్తుల సంస్థ కరవు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఈ పది మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షపాతం నమోద్కెందన్నారు. అలాగే సీతారామపురంలో 50శాతానికి పైగా, మిగిలిన 9 మండలాల్లో 30 నుంచి 40 శాతం మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఈ పది మండలాల్లో 7156మంది రైతులకు చెందిన 9053.21 హెక్టార్లలో వరి, శనగలు, వేరుశనగ, మినుములు, చిరు ధాన్యాలు మొదలగు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని, వీరిని ఆదుకునేందుకు 849.25 లక్షలతో ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలను కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. సీతారామపురంలో అత్యధికంగా 148మంది రైతులు 69 హెక్టార్లలో పంటలు నష్టపోయారని, వీరికి 9.25 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అంచనావేసినట్లు చెప్పారు. అలాగే పశు సంవర్థకశాఖకు సంబంధించి 7,42,306 చిన్న, పెద్ద పశునష్టం జరగ్గా, ఎన్‌డిఆర్ఎఫ్ నిబంధనల మేరకు 5302 పశువులకు నష్టపరిహారం చెల్లించేందుకు అవకాశం వుందని, ఈ పది మండలాల్లో పశుదాణా, మందుల కోసం రూ.291.15 లక్షలు బడ్జెట్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. గ్రామీణ మంచినీటి సరఫరా విభాగానికి సంబంధించి కరవు మండలాల్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు బోర్‌వేల్స్, సిపిడబ్ల్యుఎస్ స్కీమ్స్, వాటర్‌ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్న సీతారామపురం మండలంలో కూడా నీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా అవసరమైన నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలోని 10 కరవు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయ్, పశు సంవర్థకశాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుకు రూ.1335.69 లక్షల మేర నిధులు అవసరమని కలెక్టర్ కేంద్ర బృందసభ్యులకు వివరించారు. జిల్లాలో వర్షాలు చెదురు ముదురుగానే కురుస్తున్నాయని, రానున్న రెండు నెలలు ఇదే పరిస్థితి ఉంటే మెట్ట ప్రాంతాల్లో తాగు, సాగు నీటికి ఇబ్బంది కలుగుతాయని, ట్యాంకర్ల ద్వారా తాగునీటిని చేయాల్సి వస్తుందని చెప్పారు. ఈ పరిస్థితులను దృష్టిలో జిల్లాకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కేంద్ర బృంద సభ్యులకు కలెక్టర్ కోరారు.

### ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన కేంద్ర బృంద సభ్యులు

శంకరన్ సమావేశ మందిరంలో జిల్లాలో కరవు పరిస్థితులను వివరించే ఫొటోలతో సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, పశుసంవర్థకశాఖల సంబంధించిన జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు ఫొటోలతో కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో లవన్న, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, పశుసంవర్థకశాఖ జేడి మహేశ్వరుడు, నుడా వీసి బాపిరెడ్డి, సీపీవో రాజు, ఇరిగేషన్ డిఇ రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ తిరుమలకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# జగన్మోహన్‌రెడ్డిని కలిసిన బొట్లా రామారావు



(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జూన్ 19)

వైసీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డిని వైఎస్సార్సీపీ రాష్ట్ర బీసీ విభాగం జోన్ 5 ఇంచార్జి బొట్లా రామారావు తాడేపల్లి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. వైఎస్సార్సీపీ ఓటమి గురించి, ప్రకాశం జిల్లాలో నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు గురించి బొట్లా రామారావు చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుచూ ఓటమి పై సమీక్షలు జరుపుతామన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ప్రతి నియోజకవర్గంలో పార్టీ తరపున ప్రతినిధులు ను అందుబాటులో ఉంచి ప్రతి రోజు అప్రమత్తంగా ఉండే విధంగా స్వయంగా నా పర్యవేక్షణ ఉంటుందని, ఎవ్వరూ అధైర్యం చెందవద్దని, మనం చేసిన మంచి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటుందని, విపక్షాలు ప్రజలకు అబద్ధాలు ప్రచారం చేసి, మోసపు హామీలు ఇవ్వడం వలన కొన్ని ఓట్ల ట్రాన్స్ఫర్ ద్వారా ఓటింగ్ శాతం వ్యత్యాసం తో సీట్లు కోల్పోయామని, కానీ 40 శాతం ఓటింగ్ కలిగిన మనం ప్రజలలో బలంగా ఉన్నామని అన్నారు. వైఎస్సార్సీపీ జీరో నుంచి మొదలయ్యింది అని, నేడు ఉన్న 40 శాతం ఓట్లకు తోడు ప్రజలు నిజం తెలుసుకొని మనకు అండగా నిలుస్తారనే విశ్వాసం, నమ్మకం ఉందని అన్నారు.

# జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు హాకీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే వారు 1-1-1995 తర్వాత పుట్టిన వారై ఉండాలని, జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డ్, వయసు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్‌లతో హాజరుకావాలని హాకీ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఏ.సుందరామిరెడ్డి తెలిపారు, పూర్తి వివరాలకు పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ 9666067764ను సంప్రదించాలని కోరారు.

# ఎంపీ, ఎమ్మెల్యేలను అభినందించిన గునుపూడి భాస్కర్








(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ చార ధామ యాత్రను కుటుంబ సభ్యులతో దిగ్విజయంగా ముగించుకొని స్వగ్రామమైన పొదిలికి చేరుకున్నారు. బుధవారం గునుపూడి భాస్కర్ తన ముఖ్య అనుచరులతో కలిసి ప్రత్యేక వాహనాలల్లో ఒంగోలు తరలి వెళ్లారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయా పార్టీ కార్యాలయాల్లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను గునుపూడి భాస్కర్ అభిమానుల కేరింతల మధ్య వారికి గజమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి జిందాబాద్, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జిందాబాద్ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి జిందాబాద్, గునుపూడి భాస్కర్ జిందాబాద్ అంటూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున జేజేలు పలికారు. ఆయా కార్యాలయాలల్లో గునుపూడి భాస్కర్ ఆధ్వర్యంలో ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ల చేతుల మీదుగా భారీ కేక్‌లను కట్ చేయించి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పొదిలి పంచాయితీ మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష, టిడిపి ఆర్యవైశ్య సంఘం నాయకులు సోమిశెట్టి చిరంజీవి, మహిళా నాయకురాలు సోమిశెట్టి శ్రీదేవి, సామి రాజా, పెరుమాళ్ళ చెంచు నారాయణ, అవినాష్, నరేష్, కారంశెట్టి నరసింహం, నాయకులు షేక్ మదార్‌వలి, షేక్ సంధాని, ఉస్మాన్, పెద్ద సంఖ్యలో అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## 29వ డివిజన్‌లో వీధిలైట్లకు మరమ్మతులు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆదేశాలతో 29వ డివిజన్ లో డివిజన్ అధ్యక్షుడు పెద్దిశెట్టి చంద్ర-వరలక్ష్మి ఆధ్వర్యంలో డివిజన్‌లోని నాయకులతో వీధి లైట్లు పోయిన స్తంభాలకు లైట్లు వేయిస్తున్నట్లు వరలక్ష్మి తెలిపారు. డివిజన్లో ఉండే స్థానికులు తమకు తెలిపిన సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నారు. ఆమెతో పాటు డివిజన్లో నాయకులు పాల్గొన్నారు.

## హోం మంత్రి వంగలపూడి అనితని కలిసిన పలువురు టీడీపీ నాయకురాళ్లు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

మంగళగిరి కేంద్ర కార్యాలయంలో హోం మినిస్టర్ వంగలపూడి అనితని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షు రాలు ఆర్ల వెంకటరత్నం, అంగన్‌వాడీ డ్వాక్రా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పెద్దిశెట్టి వరలక్ష్మి, అనంతరం మహిళలతో హోం మినిస్టర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. నాలం నరసమ్మ, టి అనంతమ్మ, రావుల పద్మజ, బి అరుణ, తదితరులు ఉన్నారు.



## మాగుంట కార్యాలయంలో ఎమ్మెల్యేలకు అల్పాహార విందు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలకు ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఆయన నివాసంలో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ విందు కార్యక్రమంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బి ఎన్ విజయకుమార్, దర్శి ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దామచర్ల సత్యలు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల పై చర్యలు తీసుకోవాలి

### ఎబివిపి డిమాండ్

(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 19)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఎబివిపి సూళ్లూరుపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎబివిపి తిరుపతి జిల్లా కన్వీనర్ సన్నీ మాట్లాడుతూ కార్పొరేట్ అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. అంతేగాక గవర్నమెంట్ జీవోను తుంగలోకి తొక్కుతూ పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న ఈ విద్యాశాఖ అధికారులు చోద్యం చూడడం ఎంతవరకు సబబని వారు అన్నారు. ఇప్పటికైనా ఈ అధికారులు మొద్దు నిద్ర మేల్కొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న అలాగే అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, నగర కార్యదర్శి రాకేష్, మహేష్, దేవా చందు తదితరులు పాల్గొన్నారు.



## కళ్యాణ వైభోగమే!!

**శ్రీగిరి బ్రహ్మోత్సవాల్లో అపూర్వ ఘట్టం**

**అలరించిన స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం ప్రదర్శన**

**దేవేరులతో తిరు వీధులలో మెరిసిన దేవదేవుడు**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 19)

శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తులకు చిరస్మరణీయమైన అనుభూతిని కలుగ చేసాయి. బుధవారం ఉదయం శ్రీగిరి కళ్యాణ మంటపంలో పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని తిలకించి పులకిత ఆనంద హృదయులయ్యారు. సాయంత్రం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి తిరు వీథోత్సవం నిర్వహించారు. ఉభయ దేవేరులతో శ్రీవారు తిరువీధులలో విహరించేందుకు రావడంతో మహిళలు శ్రీవారికి మంగళ హారతులిచ్చారు. ప్రముఖ కోలాట శిక్షకులు స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట విన్యాసాలతో భక్తులను అలరింప చేసారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సి.వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి లతోపాటు ఆలూరు జై శంకర్ తదితరులు స్వర్ణ సుబ్బారావు కోలాట బృందం కళాకారులను ఘనంగా సన్మానించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు చేసిన కన్నంభాకం హరికృష్ణ





(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 19)

రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు సందర్భంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నంభాకం హరికృష్ణ, ప్రకాష్, రజియా మరియు యాసిన్ భాష ఆధ్వర్యంలో ప్రజా సేవాకార్యక్రమాలు చేయడం జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు, అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి పండ్లు, బ్రేడ్ ప్యాకెట్లు పంచారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి కాంగ్రెస్‌కు 49 సీట్లు నుంచి 99 సీట్లు పెంచారు, బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వంలో దేశంలోని ప్రజలమధ్య మతాల పేరుతో ద్వేషం పెంచి గొడవలు పెడుతుంటే రాహుల్ గాంధీ భారతదేశం మొత్తం భారత్ జోడోయాత్ర మరియు భారత్ న్యాయ్ యాత్ర చేసి ప్రజలను ఐక్యం చేసి పగ, ద్వేషం అనే సమాజంలో ప్రేమానురాగం అనే దుకాణం ఓపెన్ చేసి ప్రజల మధ్య ప్రేమ పెంచిన మహానుభావుడు రాహుల్ గాంధీ అని తెలియజేశారు. భారతదేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని అనుకుంటున్నారని త్వరలోనే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవతారని తెలిపారు.

# ప్రజా నాయకురాలికి అభినందనల వెల్లువ











(షణ్ముఖ వెలుగు, కోవూరు, జూన్ 19)
కోవూరు నియోజకవర్గానికి తొలి మహిళా శాసనసభ్యురాలిగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని కోవూరు ఆర్య వైశ్య సంఘ మహిళా విభాగ కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసానికి చేరుకున్న వారు.. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని శాలువాలు, పుష్ప గుచ్ఛాలతో సన్మానించి తమ అభిమానం చాటుకున్నారు. అదేవిధంగా విడవలూరు మండలం వావిళ్ళ ఎంపిటిసి సభ్యుడు ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వావిళ్ళ గ్రామ పరిధిలోని స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇందుకూరుపేట కొత్తూరు సాయిబాబా ఆలయ చైర్మన్ కోదండ రామిరెడ్డి గారు, రావూరు మాజీ ఎంపిటిసి లక్ష్మయ్యతో పాటు స్థానిక టిడిపి నాయకులు గోపాల్ యాదవ్, కొండాపురం టిడిపి మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, తదితరులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసి అభినందనలు అందజేశారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నిషిద్ధం

### పట్టణమంతా హెచ్చరిక బోర్డులు

### హెచ్చరించిన సూళ్లూరుపేట పోలీసులు




(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జూన్ 19)
సూళ్లూరుపేట పట్టణంతో పాటు సూళ్లూరుపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని తడ, శ్రీహరికోట ప్రాంతాల్లో ఇకపై బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం పై నిషేధం విధించడం జరిగిందని సీఐ మధు బాబు తెలిపారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు బుధవారం పట్టణం లోని 12 చోట్ల సీఐ మధుబాబు స్వయంగా పోలీస్ వారి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇక పై ఎక్కడా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించకూడదని, ఎక్కడైనా అలా జరుగుతుంటే వెంటనే సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## ఫీజుల దందా వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో పాఠశాలకు సంబంధించిన దిష్టి బొమ్మను దగ్ధం చేయడానికి ట్రై చేయడంతో, గమనించిన టూటౌన్ పోలీసులు దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని దగ్ధం చేయకుండా ఏబీవీపీ నాయకులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అనేక పాఠశాలలు పుస్తకాలు అమ్మడం అదేవిధంగా అనేక ఫీజుల పేర్లతో తల్లిదండ్రుల యొక్క రక్తం పిలుస్తున్నటువంటి యొక్క ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. అదేవిధంగా అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి, సుదర్శన్ రెడ్డి, శామ్యూల్,అయ్యప్ప,గురునాథ్, ఈశ్వర్ రెడ్డి, సాల్మన్, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న ముస్లిం మైనార్టీ నాయకులు

### షేక్ సిరాజుద్దీన్





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 19)
చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, ఆనం రామనారాయనరెడ్డి రాష్ట్ర మంత్రిగా నియమితులైతే మండలంలోని అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తానని మండల ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్ ఎన్నికలకు ముందు మొక్కుకున్నారు. వారి కోరిక నెరవేరి కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, ఆనం రామనారాయణ రెడ్డి దేవదాయ శాఖ మంత్రిగా నియమితులైన సందర్భంగా చేజర్ల మండల ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో మండలంలోని అంకమ్మ తల్లికి ఉభయ కర్తలుగా వ్యవహరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్ర్యక్రమం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రావి పెంచల రెడ్డి, చేజర్ల మండల టిడిపి అధ్యక్షులు రావి లక్ష్మీనరసి రెడ్డి, చేజర్ల మండల సొసైటీ అధ్యక్షులు బూదల్ల వీర రాఘవరెడ్డి, పుట్టుపల్లి ఎంపీటీసీ మస్తానయ్య, సోమవరపు హాజరతయ్య,భారతీయ మహాసేన అధ్యక్షులు జువ్విగుంట బాబు, రావి కృష్ణారెడ్డి, అరవ గోపాల్ రెడ్డి, ఆర్యవైశ్య అధ్యక్షులు పువ్వాడి శ్రీనివాసులు, శ్రీను, అంకమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గవరపు సుధాకర్, మాజీ చేజర్ల సర్పంచ్ బూదల్ల విజయ, సృజన , మస్తానమ్మ , విజయలక్ష్మి, రమాదేవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అల్లీపురం టిడ్కో ఇళ్ళ పరిసరాల్లో కార్డన్ సెర్చ్

### తనిఖీలు నిర్వహించిన నెల్లూరు రూరల్ సీఐ




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జూన్ 19)
అల్లీపురం టిడ్కో ఇళ్ళు ఆయా పరిధిలో సెబ్, స్థానిక పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కార్డన్ సర్చ్ నిర్వహించారు. అల్లీపురంలోని టిడ్కో గృహాలలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చర్యలు చేపట్టారు. స్థానికులతో మాట్లాడిన రూరల్ పోలీసులు ప్రశాంతంగా ఉన్నట్లు వెల్లడించారు. ఆయా పరిసరాలలో సంబంధిత పోలీసులు గస్తీని ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేగాక ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అనుమానితులు, కొత్త వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.



## సాయిబాబా విగ్రహాన్ని బహూకరించిన ఇందుకుమార్ శర్మ


(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 19)
కనిగిరి శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం ప్రధాన అర్చకులు 35 సంవత్సరాలుగా బాబాకి సేవలు అందించిన కీ.శే శ్రీ సంగుభొట్ల శ్రీనివాసమూర్తి జ్ఞాపకార్థం వారి కుమారుడు వేదపండితులు శ్రీ సంగుభొట్ల ఇందుకుమార్ శర్మ 6 లక్షల విలువ చేసే 12 అడుగుల బాబా విగ్రహాన్ని బుధవారం శ్రీ షిరిడీ సాయిబాబా దేవస్థానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు దేవకి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర బ్రాహ్మణ సెక్రటరీ సంగరాజు సాయి మనోజ్, దేవకి శ్రీనివాసులు ,ముచర్ల ధర్మ, ఆలయ పూజారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీ అందచేసి 24 గంటలు కాకముందే హైవే బాధితుల అమౌంట్ రిలీజ్

### ఉగ్ర మార్కు అభివృద్ధి

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 19)
కనిగిరి సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తన మార్కును చూపించారు. పదేళ్లుగా నిలిచిపోయిన కనిగిరి బైపాస్ హైవే 565లో భూములు కోల్పోయిన వారికి సుమారు 13.39 కోట్లను నేషనల్ హైవే విడుదల చేస్తున్నట్లు నేడు ఉత్తర్వులు ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి అందాయి. ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యే కాగానే సమస్యపైన దృష్టిపెట్టి ఉన్నత స్థాయి ఒత్తిడి తేవడం ద్వారా నిధులు విడుదల కావడంతో హైవే బాధితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
(R&B) NATIONAL HIGHWAYS

From
Executive Engineer (R&B)
NH Division :: Vijayawada

To
The Joint Collector & CALA NH 565
Ongole
Prakasam District.

Sir

# విద్యుత్ షాక్‌తో లైన్ మెన్‌కు తీవ్ర గాయాలు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 19)

మండలంలోని అనుమల వీడు సచివాలయ పరిధిలో విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ నాయక్‌కు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. నాయక్ పాలక వీడు చెరువు కట్ట సమీపంలో విద్యుత్ స్తంభంపై విద్యుత్ మరమ్మత్తు పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు సరఫరా కావడంతో ఆ షాక్‌తో నాయక్ స్తంభం పై నుండి కిందపడి పోయాడు. కాలికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు విద్యుత్ అధికారులతో పాటు 108వాహనంకి సమాచారం అందించడంతో వారు వచ్చి ప్రథమ చికిత్స నిర్వహించి వెంటనే గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నంద్యాల తరలిస్తున్నట్లు సమాచారం.

# మమ్మూలను విధుల్లోకి తీసుకోండి

## వాలంటీర్లు విజ్ఞప్తి



(షణ్ముఖ వెలుగు, అర్ధవీడు, జూన్ 19)

తమను విధుల్లోకి తీసుకోవాలని మండలంలోని పెద్ద కందుకూరు గ్రామ పంచాయతీ వాలంటీర్లు ఎం కేశిరెడ్డి , ఎం లక్ష్మి దేవి , స్థానిక ఎంపీడీవో సాంబశివరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. తాము పెద్దకందుకూరు గ్రామ సచివాలయం లో వాలంటీర్లుగా విధులను సక్రమంగా నిర్వహించామని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వైఎస్సార్ సిపి నాయకులు మా చేత బలవంతంగా రాజీనామా చేయించారు. అంతేకానీ మేము స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదన్నారు. మాకు ఉద్యోగ అర్హత వయస్సు కూడా దాటిపోయిందని , వేరే ఉద్యోగం చేయుటకు అవకాశం లేదన్నారు. ఇప్పుడు వాలంటీర్లుగా అవకాశం ఇక్యకపోతే మేము జీవనాధారం కోల్పోయి మా బతుకులు బజారున పడతాయన్నారు. మీరు అవకాశం కల్పించిన యెడల మేము తిరిగి విధులలో చేరి సక్రమంగా విధులు నిర్వహిస్తామని విన్నవించారు. వాలంటీర్లుగా తమను కొనసాగించాల్సిందిగా వినతి పత్రంలో కోరారు.

# కూటమి గెలుపుతో కాలినడకన శ్రీశైలం పాదయాత్ర




(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జూన్ 19)

కృష్ణాజిల్లా గన్నవరం నియోజక వర్గంలో కూటమి గెలుపుతో ఈ నెల 15వ తేదీన ఉదయం గన్నవరం నుంచి శ్రీశైలం (శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దర్శనం కోసం) పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర దోర్నాలకు చేరుకునే వరకు 235 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు గెలుపు పొందిన వారికోసం మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు బాలచౌరి, కాకినాడ జిల్లా పిఠాపురం శాసనసభ్యులు జనసేన పార్టీ అధినేత ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, గన్నవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ యార్లగడ్డ వెంకట్రావు కూటమి విజయం సాధించడంతో శ్రీశైలం పాదయాత్ర చేపడుతున్నామని తోట సత్యనారాయణ అలియాస్ పండు, సీతంశెట్టి తిరునాద్, గోళ్ళ వెంకటేశ్వరరావు ఇలియాస్ చిన్ని, వి శివ, చిర్లం రాజేష్, రాజులపాటి రోహిత్, బోర్ర రవితేజ తెలిపారు. పాదయాత్ర చేసే నాయకులకు, దోర్నాలకు చెందిన జనసేన, టిడిపి నాయకులు, జనసేన జిల్లా జనరల్ సెక్రెటరీ కమ్మ వెంకటేశ్వర్లు (పెద్ద పండు), కె.వి. నాయుడు (చిన్న పండు), మాజీ వార్డు సభ్యులు వీరపనేని సంపత్ కుమార్,చల్లా సురేష్,షేక్ హర్షత్, పాదయాత్ర చేపడుతున్న వారికి ఘన స్వాగతం పలికి వారికి అల్పాహారం అందించారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల విక్రయాల పై చర్యలు తీసుకోవాలి




(షణ్ముఖ వెలుగు, నాయుడుపేట, జూన్ 19)

మండలంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న పుస్తకాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడుకు చందు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో నాయుడుపేట ఎంఈఓ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం నాయుడుపేట మండలంలో ఉన్న కొన్ని ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు అమ్మడం జరుగుతుందని, ఆ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయుడుపేట మండలం విద్యాధికారి మునిరత్నం కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తడుకు చందు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూలు , పుస్తకాల అమ్మకాలతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట పరిధిలో పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు అమ్మకాల వ్యాపారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఫీజుల కోసం తల్లిదండ్రులను వేధిస్తున్న పరిస్థితులు ఉన్నాయ న్నారు. కాగా విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అధిక ఫీజులు వసూలు చేస్తూ పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం తీసుకొస్తామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యదర్శి వినయ్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో విద్యాకిట్ల పంపిణీ

## విద్యా కిట్లను బహూకరిస్తున్న టీడీపీ నాయకులు

(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, జూన్ 19)

మండలంలోని మోట్ల మల్లికార్జునపురం ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం కూటమి నాయకుల చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల టీడీపీ కన్వీనర్ యేర్వ మల్లికార్జున రెడ్డి,నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, బట్టు విద్యాసంస్థల చైర్మన్ బట్టు రమణారెడ్డి,జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మురళిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థిని,విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, మంగమ్మ, గుండారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కడిమెట్ల శ్రీనివాస్ యాదవ్, షేక్ మంజూర్, తదితరులు పాల్గొన్నారు.




# మహిళల్లో రక్తహీనత పై అవగాహన ర్యాలీ





(షణ్ముఖ వెలుగు, పుల్లలచెరువు, జూన్ 19)

గిరిజన ప్రాంత ప్రజలకు సికిల్ సెల్ ఎనీమియాపై(మహిళల్లో రక్తహీనతపై) మరింతగా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఏపియం నూనె వెంకటయ్య అన్నారు. పుల్లలచెరువు మండల కేంద్రంలో బుధవారం మహిళల్లో రక్తహీనతపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మహిళలు ప్రపంచ మహిళల్లో రక్తహీనత దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీగా వచ్చి అక్కడ మానవహారం నిర్వహించారు. 0 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చేశారు. అలాగే మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపీడీవో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమన్వయంతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# మహిళల్లో రక్తహీనతపై అవగాహన సదస్సు







(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 19)

మండలంలోని ప్రపంచ మహిళల రక్తహీనత దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలో మహిళల్లో రక్తహీనతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. 40 ఏళ్లు వయస్సు కలిగిన వారికి సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేశారు. రక్తహీనత రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అను సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవి, సిహెచ్ఓ కెవి చెన్నయ్య, ఎమ్ఎల్‌హెచ్‌పిఎస్ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com